

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
# వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 19, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 5494 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.886 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 100, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి 2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.157 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు

## మలిశెట్టి కుమార్తె, అల్లుడిని ఆశీర్వదించిన మంత్రి నారాలోకేష్



**కావలి,డిసెంబర్ 19 ప్రభాతవార్త :** టిడిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కావలి మాజీ ఏఎంసి ఛైర్మెన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి దంపతుల పెద్దకుమార్తె హరిప్రియ, అల్లుడు సాయికుమార్‌ల వివాహం కావలి పటటణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఐటి, విద్యాశాఖల మంత్రి నారాలోకేష్‌బాబు అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా రాలేకపోయినందున హరిప్రియ, సాయికుమార్‌లను శుక్రవారం ఉండవల్లిలోని వారి నివాసానికి పిలిపించుకొని ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మలిశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## కార్పోరేషన్ ఆదాయం పెంచేందుకు ప్రతి అధికారి కృషి చేయాలి

### ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్క అధికారి మనస్ఫూర్తిగా కృషి చేయాలని ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ ఆకాక్షించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ మేయర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రూప్‌కుమార్ యాదవ్ కార్యాలయం లోని మేయర్ చాంబర్‌లో కమీషనర్‌తో పాటు అన్ని విభాగాల అధికారులతో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు వారికి సంబంధించిన ఆదాయ మర్గాలలో మరింత ప్రణాళిక బద్దంగా చర్యలు తీసుకొని కార్పోరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు దోహదపడాలని సూచించారు. అలాగే ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలలో దుబారా ఖర్చులు తగ్గించి, కార్పోరేషన్ వనరులు వృధా కాకుడా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కమిషనర్ వై.ఓ.నందన్ మాట్లాడుతూ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఎన్ఆర్ఎస్, బిపిఎస్ పరకాల అమలు ద్వారా రాబడిని పెంచేందుకు విశేషంగా కృషి చేస్తున్నామని వివరించారు. మొండిబకాయిలకు సంబంధించిన ఆస్థిపన్నులు, తాగునీటి కుళాయి పన్నులు, ఖాళీస్థలం పన్నులను వసూలు చేసేందుకు లోక్ అదాలత్ ద్వారా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచేందుకు అవసరమైన అన్ని చర్యలను పటిష్టంగా అమలు చేస్తున్నామని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో సిటీప్లానర్ హిమబిందు, సెక్రటరీ శ్రీలక్ష్మి, ఆర్యోశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, టిపిఆర్ఓ వాసుబాబు, మేనేజర్ రాజేశ్వరి, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, అనీల్‌కుమార్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే



కందుకూరు డిసెంబర్ 19, ప్రభాత వార్త 21వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక సబ్ కలెక్టర్ దామెర హిమ వంశీతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయంలో పల్స్ పోలియో పోస్టర్ ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని, సమీపంలోని పోలియో కేంద్రాలకు పిల్లలను తీసుకువెళ్లాలని సూచించారు. కందుకూరు నియోజకవర్గాన్ని పోలియో రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి రమేష్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు బ్యూలా గ్రేస్, స్టెల్లా కారుణ్య, పీహెచ్ఎన్ ఐ.పద్మావతి పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో ఎంప్లాయిస్ గ్రీవెన్స్

### - ఉద్యోగస్తుల గ్రీవెన్స్‌కు 64 అర్జీలు



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని తిక్కన హాలులో ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డేను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని 64 మంది ఉద్యోగస్తులు వారి వారి సమస్యలకు సంబంధించిన అర్జీలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్‌లకు అందజేశారు. ప్రతి ఉద్యోగస్తునితో కలెక్టర్, జాయింట్ కలెక్టర్,డి.ఆర్.ఓ వారితో ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సంబంధిత దరఖాస్తులను ఆయా శాఖ అధికారులకు అందజేసి సత్వరమే పరిష్కరించవలసిందిగా సూచించారు. పలువురు ఉద్యోగస్తులు కలెక్టర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కలువాయిని తిరుపతిలో కలపవద్దంటూ వికలాంగుల ఆందోళన

### "తిరుమల వెంకన్న కలువాయిని కాపాడయ్యా"



**కలువాయి డిసెంబర్ 19 ప్రభాతవార్త** కలువాయి మండలాన్ని యధావిధిగా నెల్లూరు జిల్లాలోని కొనసాగించాలంటూ మండలంలోని వికలాంగులు యూనియన్ నాయకులు కలువాయి సేవ్ నినాదంతో రిలే నిరాహారదీక్ష లో పాల్గొన్నారు. బస్టాండ్ కూడలి నందు 11 వ రోజు తిరుతి వద్దు నెల్లూరు ముద్దు అంటు శుక్రవారం జరిగిన రిలే నిరాహారదీక్షలో వికలాంగు పాల్గొనగాకలువాయి బజార్ వీధి షాపు వర్కర్స్ యూనియన్స్ విద్యార్థులు ,యువకులు వారికి సంఘీబావం తెలిపారు. ❖ తిరుపతి జిల్లాలో కలువాయి మండలాన్ని కలపడం వల్ల వికలాంగులమైన మేము సదరన్ సర్టిఫికేట్‌తోపాటు ఏ అవసరం నిమిత్తం అయినా దగ్గరలో ఉన్న నెల్లూరుని వదలి 150 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లాలంటే మా బాధలు "తిరమల వెంకన్నకు" తెలుసునని వారు ఆవేదన వెలబుచ్చారు. అదే విధంగా మండలంలోని దూర వ్యత్యాసాన్ని ప్రభుత్వ పెద్దలు మరోసారి పరిగణలోకి తీసుకొని జిల్లా నుండి కలువాయి మండలం విడిపోవడం వల్ల అన్ని వర్గాల అన్ని విధాల ఎదుర్కొనే సమస్యలు తీవ్రతరం అవుతుందని మరోసారి మా బాధను ఆలకించాలని చేతులెత్తి వికలాంగులు దండాలు పెట్టారు. వర్కర్స్ యూనియర్ ఆద్వర్యంలో షాపులు మూసి వేసి "సేవ్ కలువాయి అంటు" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు నిర్వహణపై సెక్రటరీలకు శిక్షణ



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటు నిర్వహణపై హైదరాబాద్ రాజ్ భవన్‌రోడ్డు లో ఏఎస్‌సిఐ కళాశాలలో మూడు రోజులు పాటు జరిగిన పబ్లిక్, ప్రైవేటు పార్టనర్షిప్ శిక్షణా కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన వార్డు శానిటరీస్ సచివాలయ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ శిక్షణ పూర్తి చేసుకొన్న కార్యదర్శులకు కమీషనర్ వైవి.నందన్ శుక్రవారం కార్యాలయంలోని కమీషనర్ చాంబర్‌లో ద్రువీకరణ పత్రాలు అందజేశారు. శిక్షణ పొందిన వారిలో శానిటేషన్ విభాగానికి చెందిన దారా సురేష్‌బాబు, దినేష్, సరస్వతిదేవి, ఇంజనీరింగ్ విభాగం నుంచి విష్ణుతేజలు ఉన్నారు.

## చిన్నారులు, మహిళలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు

### - అంగన్‌వాడి సిబ్బందికి రూ. 70 కోట్లతో మొబైల్ ఫోన్లు



**ముత్తుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త** చిన్నారులు, మహిళలకు మెరుగైన సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారని అందులో భాగంగా అంగన్‌వాడి సిబ్బందికి రూ. 70 కోట్ల రూపాయలతో మొబైల్ ఫోన్లు పంపిణి చేసామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ముత్తుకూరు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో అంగన్‌వాడి సిబ్బందికి ఫోన్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లకు ప్రభుత్వం రూ. 14 వేల విలువైన సెల్ ఫోన్‌ను అందిస్తోందన్నారు.

❖ జిల్లా వ్యాప్తంగా 2934 అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారికి ఈ సెల్ ఫోన్లను అందిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీకి ప్రభుత్వం రూ.70 కోట్లు కేటాయించిన నా సోదరి మంత్రి సంధ్యారాణికి ధన్యవాదాలు తెలిపారు.

❖ మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా చిన్నారులు, మహిళలకు సేవలు అందించేందుకు ఈ సెల్ ఫోన్లు తోడ్పడుతాయన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే సూచనలు, ఆదేశాలను ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అమలు చేసేందుకు దోహదం చేస్తాయన్నారు.

❖ అనేక అంగన్ వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసి వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. చిన్నారులను సొంత బిడ్డల్లా ఆదరిస్తూ సేవలు అందిస్తున్న అంగన్ వాడీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నానన్నారు. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి వేతనాలను రూ.7 వేలు నుంచి రూ.11500కి పెంచింది గిరిజనులు, దళిత బిడ్డలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సిబ్బందికి నా సూచప్రత్యేకంగా ప్రతి గిరిజన బిడ్డ అంగన్ వాడీ కేంద్రానికి వచ్చి పౌష్టికాహారం తీసుకునేలా చూసుకోవాలన్నారు. సమాజంలో అత్యంత అమాయకులైన గిరిజనుల అభ్యున్నతి విషయంలో నేను కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున ట్లు తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 50 వేల మంది గిరిజన బిడ్డలు ఉన్నారు.

❖ ఇప్పటికే 11 గిరిజన కాలనీలను పామాయిల్ కంపెనీలు దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాన న్నారు. ఈ విషయంలో అదానీ ఫౌండేష న్, ఎస్ఈఐఎల్ కంపెనీలు కూడా ముందుకొచ్చా యి. ఇప్పటికే పలు కంపెనీలు తమ కార్యాచరణ కూడా ప్రారంభించాయన్నారు. గిరిజన కాలనీల్లో అవసరమైన వసతులు కల్పించడంతో పాటు వారి ఆర్తికాబి వృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకుంటు న్నార న్నారు. ప్రజల ఆరోగ్యంపైనా కూటమి ప్రభు త్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని సర్వేపల్లి నియోజ కవర్గంలో 39 ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి రూ. 13.78 కోట్లు మంజూరు చేసిన మంత్రి సత్యకుమా ర్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

❖ తాళ్లపూడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.1.43 కోట్లు, ముత్తుకూరు, తాళ్లపూడిలో బ్లాక్ హెల్త్ యూనిట్ల నిర్మాణానికి మరో రూ. కోటి మంజూరయ్యాయన్నారు. దాదాపు అన్ని గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు భవనాలు అందుబాటులోకి రాబోతున్నాయని తెలిపారు.

❖ ముత్తుకూరు - మామిడిపూడి రోడ్డు నిర్మాణానికి రూ.2.16 కోట్లు మంజూరు చేయించామన్నారు. అంగన్‌వాడీ భవనాలకు కూడా రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి నిధులు తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీల మల్లికార్జున యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగల శివకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్వేపల్లి ఐటి ఐ విభాగ నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు, దండు శ్రీనివాసులు, ఆలిముత్తు, ముత్తుకూరు పట్టణ అధ్యక్షులు బులిగర్ల శ్రీనివాసులు, బిజెపి నాయకులు కాకుటూరు రవీందర్ రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడు ఎంపీలతో భేటీ





**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త-వైద్యం** పార్లమెం ట్ భవనంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం సీఎం చంద్రబాబునా యుడు ఎంపీలతో భేటీ అయ్యారు. ఈ భేటీలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీలతో వివిధ అంశాలపై సీఎం చంద్రబాబు మాట్లాడి దిశానిర్దేశం చేశారు.

## జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు

### ప్రత్యేక దృష్టి సారించండి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** శుక్రవారం కలెక్టరేట్లో జిల్లాస్థాయి పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు మంచి అవకాశాలు మెండుగా ఉన్నాయని, నిమ్మ, వేరుశనగ, పాలు, మాంసం జిల్లాలో అత్యధికంగా ఉత్పత్తి అవుతున్నాయని, వీటినుంచి ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను ఏర్పాటు చేసేలా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో 14 మంది పారిశ్రామికవేత్తలు జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఒప్పందాలు కుదుర్చుకున్నా రని, ఈ పరిశ్రమలన్నింటికి అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంసిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు దరఖాస్తు చేసుకున్న వెంటనే భూ సేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నీటి వసతి, విద్యుత్ మొదలైన కనీస సౌకర్యాలను కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. అలాగే ఉద్యమ్ పోర్టల్‌లో అన్ని యూనిట్లను నమోదు చేయాలని సూచించారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం ఒక నెలలోపు అన్ని ఎంఎస్ఎమ్ఈలను ఉద్యమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే ఈపీఎఫ్ రిజిస్ట్రేషన్ కూడా తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జిఎం గణపా చంద్రశేఖర్, ఏపీఐఐసీ జెడ్ ఎం శివకుమార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ అశోక్ కుమార్, ఖాదీ వికాస్ బోర్డు డిడి ప్రసన్నలక్ష్మి, ఆర్డీవోలు అనూష, పావని, వివిధ శాఖల అధికారులు పలు పరిశ్రమల నిర్వాహకులు, పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయం

### - ఐక్యత, ప్రేమ, దయతో నిజాయితీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశం
### - జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల






**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయమని, మానవ జీవితంలో ప్రతిఒక్కరూ ఐక్యత, ప్రేమ, దయతో నిజాయితీగా జీవించడమే క్రీస్తు బోధనల సారాంశమని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు హైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, కరుణ, త్యాగం, మానవ సేవకు ప్రతీక అని అన్నారు. యేసు క్రీస్తు బోధించిన శాంతి, సోదరభావం, సేవా భావం సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు దోహదపడుతాయని తెలిపారు. అన్ని మతాలు, వర్గాల మధ్య పరస్పర గౌరవం నెలకొనాలనే ఉద్దేశంతో ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే క్రిస్మస్ పండుగ జిల్లా ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, శాంతి తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ ప్రత్యేకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

**సహోదర లాలనం, సమాధానపాలనం యేసుక్రీస్తు జననం ప్రధాన సందేశాలు: బిషప్**

బిషప్ మోస్ట్ రెవ. పిల్లి ఆంథోని దాస్ మాట్లాడుతూ మహోన్నతుడు, మహనీయుడు ఒక మానవుడిగా జన్మించిన పర్వదినం క్రిస్మస్ అని, ప్రభువు యేసు గొప్పతనాన్ని వివరించారు. సహోదర లాలనం, సమాధానపాలనం బాల యేసు జననం ముఖ్య లక్ష్యాలని తెలిపారు. ఇతరులకు ఆనందాన్ని కలిగిస్తూ పరోపకారం చేయడం క్రీస్తుపై ఉన్న విశ్వాసం, నమ్మకానికి నిదర్శమని చెప్పారు. మనమంతా మతసామరస్యం, మత స్వేచ్ఛ కలిగి ఒకే కుటుంబంగా కలిసిమెలిసి జీవించాలన్నది క్రీస్తు బోధనల సారాంశం అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, ప్రభుత్వంపై యేసు ప్రభువు దీవెనలు వుండాలని, నిధులు, వనరులు సమకూరి రాష్ట్రం సుభిక్షంగా వుండాలని ఆయన ప్రభువును ప్రార్థించారు. తొలుత క్రిస్మస్ ట్రీని ఆవిష్కరించి కలెక్టర్, పాస్టర్లు ప్రీ క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు.

అనంతరం క్రీస్తు జననం, ప్రాముఖ్యతపై ఆలపించిన పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. తదుపరి పలువురు పాస్టర్లు క్రీస్తు జనన విశేషాలను, క్రీస్తు బోధనలను తమ ప్రసంగాల్లో వివరించారు. కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వొత్తులు వెలిగించి క్రిస్మస్ సందేశాన్ని చాటిచెప్పారు. అనంతరం అతిథుల చేతులు మీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్ల విజ్ఞప్తి మేరకు నెల్లూరు నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మాణం, స్మశాన వాటికల అభివృద్ధి, పాస్టర్ల గౌరవ వేతనం మంజూరు మొదలైన అంశాలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఇప్పటి నుంచే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విజయకుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ రఘు, వివిధ సంఘాల పాస్టర్లు దయాసాగర్, ఎలీషాకుమార్, సురేంద్రబాబు, శోభన్‌బాబు, బర్నబాస్, ఉదయ్ కుమార్, స్టీఫెన్, డేనియల్, హనోక్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లో కల్తీ : వాహనదారులు ఆందోళన



**అల్లూరు, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** అల్లూరులోని హెచ్‌పి పెట్రోల్‌బంకులో నీరు కలిపిన పెట్రల్, డీజల్‌ను అమ్ముతున్నారని వాహనదారులు శుక్రవారం పెట్రోల్ బంకు వద్ద పెట్రోల్, డీజల్ బాటిళ్ళను చేతపట్టి నిరసన చేశారు. అనంతరం వాహనదారులు మాట్లాడుతూ హెచ్‌పి పెట్రోల్ బంకులో డీజల్, పెట్రల్‌ను వాహనాలకు పోయించుకుంటుంటే బైకులు, కారులు కదలడం లేదని, వింత శబ్దాలు వస్తున్నాయని, దీంతో వాహనాలు రిపేరులు రావడంతో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం ట్రాక్టర్లు, ఆటోలు, బైకులతో ర్యాలీగా బయలుదేరి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి డిటి ప్రవీన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డిటి మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పెట్రల్ బంక్ యజమానిపై చర్యలు చేపడుతామని హామీ ఇవ్వడంతో నిరసన దారులు వెనుదిరిగారు. ఏది ఏమైనా పెట్రోల్ బంకులో నీటిని కలపడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

## సాగునీటి మరమ్మతుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** అధికారులు రైతులతో సమన్వయం చేసుకుని పంట పొలాలకు నీరు చేర్చడంలో సాగునీటి సంఘాల పాత్ర అత్యంత కీలకమని కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి అన్నారు. మాగుంట లేఅవుట్‌లోని తమ కార్యాలయంలో శుక్రవారం సాగునీటి సంఘాల డైరెక్టర్‌లు, సాగునీటి సంఘాల కార్యవర్గం, ఇరిగేషన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుత ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరా వరకు సాగునీరు చేరాలంటే పంట కాలువ బాగుండాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న ప్రతి రూపాయి సద్వినియోగం కావాలన్నారు. రానున్న రబీ సందర్భంగా సాగునీటి కాలువ నిర్వహణపై ఆయా ప్రాంతాల సాగునీటి సంఘాల డైరెక్టర్లు అధ్యక్షులు ప్రత్యేకంగా చొరవ తీసుకోవాలన్నారు. పంట పోలాలకు నీరు చేర్చడంలో అధికారులు రైతులకు మధ్య సాగునీటి సంఘాల అధ్యక్షులే వారధులన్నారు. కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని సదరన్ చానెల్, ఈస్టర్న చానెల్ , పైడేరు ఎస్కేప్ చానెల్; ఎలమంచిపాడు చానెల్‌కు సంబంధించి ఎక్కడెక్కడ గండ్లు పడ్డాయో గుర్తించి యుద్ద ప్రాంతిపదికన మరమ్మతుల్లో చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా కాలువల్లో గుర్రపు డెక్క తొలగించడం, పూడికతీత, కాలువగట్లు పటిష్టం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాఆన్నరు. సాగునీటి కాలువల మరమ్మతుల పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడారాజీ పడవద్దని ఈ సందర్భంగా ఆమె సూచించారు. నిధుల వినియోగంలో పారదర్శకత ఉంటేనే ప్రజల్లో మనపై నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పెన్నాడెల్టా ఆయకట్టు ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటసుబ్బయ్య, ఏఈ శ్రీనివాసులు కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని సాగునీటి కాలువలకు సంబంధించిన అధ్యక్షులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి

**మనుబోలు డిసెంబర్ 19 ప్రభాతవార్త :** ఈనెల 21 న జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ హుస్సే నమ్మ కోరారు. ఆమె శుక్రవారం స్థానిక ప్రభుత్వ వైద్య శాలను తనిఖీ చేశారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులకు డెంగ్యూ మలేరియా స్క్రబ్ టైఫస్ వంటి జ్వరాలపై అవగాహన కల్పించారు. మండలంలో మొత్తం 4568 మంది చిన్నారులు పోలియో చుక్కలు వేయుటమే లక్ష్యమన్నారు. మొత్తం నాలుగు రూట్లలో 40 పోలియో బూతులను ఏర్పాటు చేశారన్నారు. ఇవికాక ఒక మొబైల్ ఒక ట్రాన్సిస్ట బూతులను ఏర్పాటు చేసినట్లు ఆమె వివరించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ పూజిత సిహెచ్ఏ జయలక్ష్మి, సిహెచ్ఓ రాజయ్య, హెల్త్ సూపర్వైజర్ హెల్త్ అసిస్టెంట్లు చంద్రశేఖర్ విజయ్‌కుమార్, ఏఎన్ఎం రాజేశ్వరి, ఎమ్ఎల్ హెచ్ శ్రీ రమ్య ఉన్నారు.



## ఆక్వాకల్చర్‌పై అంతర్జాతీయ సదస్సు

**కావలి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయ కళాశాల నందు కళాశాల కార్యాచరణ సమన్వయకర్త డాక్టర్ ఎం.సుశీల ఆధ్వర్యంలో ఆరోగ్య నిర్వహణ మరియు స్థిరమైన రొయ్యల ఆక్వా కల్చర్ 2025 సంవత్సరంపై అంతర్జాతీయ సదస్సును శుక్రవారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ ప్రొపెసర్ ఆల్లం శ్రీనివాసరావు, విశిష్ట అతిథులుగా మాజీ వైస్ చాన్సలర్ ప్రొపెసర్ జి.రాజారామిరెడ్డి, మాంగ్లయాథాన్ యూనివర్శిటి వైస్ చాన్సరలర్ ప్రొపెసర్ కె.ఆర్.ఎస్‌సాంబశివరావు, అంతర్జాతీయ వ్యక్తులుగా న్యూయార్క్ స్టోనీ బ్రూక్ యూనివర్శిటి ప్రొపెసర్ శ్రీనివాస్ పెంట్యాల, యుఎస్ఏ యూనివర్శిటి ఆఫ్ వెస్ట్‌జార్జియా ప్రొపెసర్ స్వామిమ్రుతింటి విచ్చేసి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత ఆహార ఉత్పత్తిలో భాగంగా రొయ్యసాగు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని, దానిని సుస్థిరంగా పెంపొందించడానికి రొయ్య సాగులో ఆరోగ్య నిర్వహన యొక్క ప్రాముఖ్యత తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి మరియు కళాశాలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.




## అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**అనుమసముద్రంపేట ,డిసెంబరు19,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం డియస్పీ కె.వేణుగోపాల్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి కేసుల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎస్‌పేట ప్రముఖ యాత్రాస్థలం కావడంతో దర్గా వద్ద ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజలకు సూచనలు చేయాలన్నారు. డ్రంక్ అండ్‌డ్రైవ్ , మత్తు పదార్థాల విక్రయాల మీద ప్రత్యేక తనిఖీ నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో సంగం సిఐ శ్రీనివాసులురెడ్డి, స్థానిక ఎస్ఐ సైదులు , స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పోలియో రహిత సమాజానికి కృషి

**దగదర్తి, డిసెంబర్19, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలో వెలుగు ఆఫీసు కార్యాలయం నందు పోలియో రహిత సమాజం కోసం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆరోగ్య శాఖాధికారి కావలి డాక్టర్ బ్రిజిత, తహసీల్దార్ పి.కృష్ణ,ఎంపీడీవో వెంక టేశ్వర్లు,ఎంఈఓ భాస్కర్‌లు పాల్గొన్నారు. సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి బ్రిజిత మాట్లాడుతూ ఈ నెల 21, 23,23వ తేదీలలో జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ టి.అలేఖ్య, డాక్టర్ విజయ కీర్తి, కే.కొండారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.చంద్రశేఖర్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.విజయమ్మ, హెల్త్ సూపర్వైజర్ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## నదులను జాతీయ సంపదగా ప్రకటించాలి

**– ప్రకృతి సహజ సిద్ధ ధర్మానికి వ్యతిరేకంగా తెలంగాణ వాదనలు – మిడతల రమేష్**



**నెల్లూరు అగ్రికల్చర్ ,డిసెంబర్ 19, ప్రభాతవార్త :** రాయలసీమ, నెల్లూరు జిల్లాలో కృష్ణ జలాల ప్రవాహంపై తెలంగాణ అభ్యంతరాలు తెలపడం హాస్యాస్పదంగా ఉందని నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన కృష్ణానది జలాల విషయంలో తెలంగాణ వాదనలను ఒక ప్రకటనలో ఖండించారు. 1981 నాటికి ముందే శ్రీశైలం నుంచి కృష్ణా జలాలు రాయలసీమలో ప్రవేశిస్తున్నాయని తెలిపారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ అంతరాష్ట్ర ఒప్పందాల ప్రకారం 1988లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మించారని గుర్తు చేశారు. నదులలో ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతాలకు నీరు ప్రవహించడం ప్రకృతి సహజ ధర్మం అన్న విషయాన్ని తెలంగాణ వాదులు గుర్తించడం లేదని, ఓట్ల కోసం రాజకీయ పార్టీలు నీటి సహజ సిద్ధ ప్రకృతి ధర్మానికి విరుద్ధంగా పోరాటాలు చేస్తున్నారని రమేష్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

## పేషెంట్లకు ఉపయోగపడే సేవా కార్యక్రమం

## జిజిహెచ్‌కు 10 వీల్‌చైర్లు వితర

**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం** నియోజకవర్గ పరిధిలోని జిల్లా ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శుక్రవారం ఉదయం మానవీయ సేవకు నిదర్శనంగా నిలిచే కార్యక్రమం జరిగింది. 23వ డివిజన్ తెలుగుదేశం పార్టీ నాయకులు పాముూరు సుధాకర్ రెడ్డి , తన తండ్రి దివంగత పాముూరు రమణారెడ్డి జ్ఞాపకార్థంగా పేషెంట్లకు ఎంతో ఉపయోగపడే 10 వీల్ చైర్లను జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని వీల్ చైర్లను అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ , అలాగే రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఎప్పటికప్పుడు సూచించే విధంగా హంగు ఆర్భాటాలకు దూరంగా ప్రజాసేవలో భాగస్వాములవ్వడమే తెలుగుదేశం పార్టీ నాయకుల లక్ష్యమని అన్నారు. అదే స్ఫూర్తితో 23వ డివిజన్ టిడిపి నాయకులు పాముూరు సుధాకర్ రెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు వీల్ చైర్లు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమంలో భాగస్వామిగా నిలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిజిహెచ్ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసులు, కమిటీ సభ్యులు మోగరాల సురేష్, బ్రహ్మారెడ్డి, దారామల్లి, కార్పొరేటర్లు దుద్దుగుంట (ఒరిస్సా) శ్రీనివాసులు రెడ్డి, మూలే విజయ్ భాస్కర్ రెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, 23వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు మేకల మధు, టిడిపి నాయకులు పుల్లారెడ్డి, నస్నం శ్రీనివాసులు, చల్లా సుబ్బన్న తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు



## ఉదయగిరి వ్యవసాయ కళాశాలలో అభినందన సభ

**ఉదయగిరి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి వ్యవసాయ కళాశాలలో శుక్రవారం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025-26 సంవత్సరానికి గాను మూడు దశలుగా నిర్వహించబడిన 18 కళాశాలల అంతర కళాశాల స్థాయి క్రీడలు ఆటలు సాంస్కృతిక సాహిత్య పోటీలలో విజేతలుగా నిలిచిన మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థినీ, విద్యార్థులకు నేడు అభినందన సభ ఏర్పాటు చేసి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి, బోధన బోధనేతర సిబ్బంది, కళాశాల కీర్తి బావుటాను విశ్వవిద్యాలయ స్థాయిలో రెపరెపలాడించి కళాశాల ఏర్పాటు చేసి ఇరవై నుంచి ఎనభై సంవత్సరాలు గడించిన కళాశాలలు సైతం అబ్బురపరిచిన తీరు, అందుకోలేని విజయాలను అందుకున్నందుకు వెయ్యి నోళ్ళ కీర్తించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులను వివిధ క్రీడలు, ఆటలు ,సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాల్లో ప్రోత్సహించి తర్ఫీదు నిచ్చిన విద్యార్థి కార్యకలాపాల అధికారి, దేహదారుఢ్య శాఖ విభాగ సంచాలకులు వి.రమణల బృందంలోని బోధన సహ, సహాయక బోధకులు, బోధనేతర సిబ్బందిని, మొదటి దశ క్రీడాకారుల బందానికి నాయకత్వం వహించిన డాక్టర్ ఎం.కిషన్ తేజను రెండవ దశ క్రీడాకారుల బృందానికి నాయకత్వం వహించిన ఏం. కిషన్ తేజను, రెండవ దశ క్రీడాకారుల బందానికి నాయకత్వం వహించిన డాక్టర్ పి.లావణ్య కుమారిని, కుమారి డాక్టర్ ఏ.సూర్య కళను , మూడవ దశ క్రీడాకారుల బృందానికి నాయకత్వం వహించిన డాక్టర్ టి.గోపికృష్ణను, బృంద సహాయకురాలుగా వచ్చిన బి.రమేష్‌ను, ఎం.రమేష్‌బాబు, షేక్ షాహిద్‌లను ప్రశంసించారు. ఆహార విజ్ఞాన , సాంకేతిక కళాశాల పులి వెందులలో నిర్వహించబడిన మొదట దశ క్రీడల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు.



## దోమల నిర్మూలనకు ఫాగింగ్ చర్యలు

**సైదాపురం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ పరిధిలో దోమలు వ్యాప్తి చెందకుండా నివారించేందుకు ముందు జాగ్రత్తగా గ్రామ సర్పంచ్ వెందోటి శారదమ్మ, పంచాయతీ కార్యదర్శి శశిఇంద్రాని ఆధ్వర్యంలో శుక్రవారం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. పంచాయతీ పరిధిలో దోమలు వల్ల మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబల కుండా ఉండేందుకు ఫాగింగ్ చేయడం జరిగిందని ఉప సర్పంచ్ బొలిగర్ల శివకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**వింజమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యచరణతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వింజమూరు తాలూకా యూనిట్ ప్రెసిడెంట్ కే.ప్రత్యూష ప్రధాన కార్యదర్శి బి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. వింజమూరులో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం భజనతో కాకుండా బాధ్యతతో పార్టీలతో కాకుండా ప్రభుత్వంతో ఉద్యోగుల సమస్యలు వారి భద్రత కొరకు ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలు విషయంలో పోరాటం చేసి తమ హక్కులను పొందే విధంగా కృషి చేస్తామన్నారు.



## ఎమ్మెల్యే స్పందనపై హర్షం

**వలేటివారిపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని 167బి జాతీయ రహదారి నుంచి కాకర్లపాలెం వరకు రహదారి వర్షం పడితే గుంతలు పడి వర్షపు నీరు నిలిచిపోయేదని ఆ రోడ్డు పొడవు సుమారు రెండు కిలోమీటర్లు మండల కేంద్రానికి రావాలన్నా ఈ రోడ్డు మార్గమే రావాలని గత ప్రభుత్వం కాలయాపన చేసి పట్టించుకున్న నాథుడే లేడు, ఇప్పుడు టీడీపీ నాయకులు, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకొని వెళ్ళగా వెంటనే స్పందించి త్వరితగతిన చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎన్.అంకయ్య, రేషన్ డీలర్ ఎన్.కొండలరావు తదితరులు కలిశారు.



## విక్రమ సింహపురి వర్సిటీలో 'డ్రోన్ టెక్నాలజీ' జాతీయ వర్క్‌షాప్ ముగింపు

**వెంకటచలం, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న "నేషనల్ వర్క్‌షాప్ ఆన్ డ్రోన్ టెక్నాలజీ" శుక్రవారం ఘనంగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం పీఎం ఉష (PM-USHA) ఆర్థిక సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.నూతన సాంకేతికతపై పట్టు సాధించాలి: వీసీ అల్లం శ్రీనివాసరావు ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీ వంటి అత్యాధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని పిలుపునిచ్చారు. పరిశోధనలు, వ్యవసాయం, రక్షణ రంగాల్లో డ్రోన్ల వినియోగం పెరిగిందని, ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని ఆయన పేర్కొన్నారు.ముఖ్యఅతిథులు,వక్తలుఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఛాన్సర్ ఆచార్య బి. రాజారామిరెడ్డి గౌరవ అతిథిగా పాల్గొని తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ డాక్టర్ కె. సునీత, మరో అతిథిగా Associate Professor Dr. M. నరేష్ బాబు, Department of CS!!E, IIITDM Kurnool పాల్గొని ప్రసంగించారు. డ్రోన్ టెక్నాలజీలో వస్తున్న విప్లవాత్మక మార్పులను వారు వివరించారు.

**కార్యక్రమ విశేషాలు,నిర్వహణ:** కంప్యూటర్ సైన్స్ విభాగం, విక్రమ సింహపురి వర్సిటీ.సహకారం: ప్రధాన్ మంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్ (PM USHA).

**ముఖ్య ఉద్దేశ్యం:** విద్యార్థులకు డ్రోన్ తయారీ, ఆపరేటింగ్,అప్లికేషన్లపై ప్రాక్టికల్ అవగాహన కల్పించడం.ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ కే సునీత కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సిహెచ్ విజయ ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా వ్యవహరించిన ఆచార్య అందే ప్రసాద్ కోకో ఆర్డినేటర్ గా డాక్టర్ M.Ussenaiah, డాక్టర్ G Vijaya Lakshmi, డాక్టర్ ఎన్ ఓ.గోపాల్, డాక్టర్ A. Siva Sankar Reddy విద్యార్థిని విద్యార్థులు పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు .




## ప్రజాదర్బార్ - ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి: కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

**నెల్లూరు రూరల్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నేటి ఉదయం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నెల్లూరు రూరల్ ప్రజలకు ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఎమ్మెల్యే కార్యాలయం ద్వారా నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తెలిపారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , యువనేత రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు వారాలుగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రజాదర్బార్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని, ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కార దిశగా అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పరిష్కారం అయ్యే ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నగర మాజీ మేయర్ నంది మండలం భాను శ్రీ, క్లస్టర్ ఇంఛార్జులు జలదంకి సుధాకర్, సాబీర్ ఖాన్, కో క్లస్టర్ ఇంచార్జ్ ఎల్.పి. కృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎస్.సి. సెల్ అధ్యక్షుడు అరవ శ్రీనివాసులు, 28వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చెక్కా సాయి సునీల్, 21వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు చాన్ భాష, 26వ డివిజన్ టిడిపి అధ్యక్షుడు బూడిద పురుషోత్తం యాదవ్, టిడిపి నాయకులు వద్లమూడి రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



## మెనూను తప్పక అమలు చేయాలి

**కోవూరు డిసెంబరు 19 ప్రభాతవార్త :** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పక అమలు చేయాలని కోవూరు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. పచ్చిపాల రామఃనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠ శాలలో శుక్రవారం జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడతూ గతంతో పోలి స్తే ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో భోజ నం తినే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కూడా ఈ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఒక ప్రణాళికబద్ధంగా అమలు చేసేలా చొరవ తీసుకోవాలన్నారు.



## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**సీతారామపురం డిసెంబర్ 19 ప్రభాతవార్త :** మండలంలోని ప్రతి గ్రామ పంచాయితీలలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటి ఎంపిడిఓ శివప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని మెయిన్ బస్టాండ్ సెంటర్ కోట వీధిలో పంచాయితీ కార్యదర్శి పిడుగు రవి అద్వర్యంలో శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శివప్రసాద్‌రావు మాట్లా డుతు పంచాయితీలోని ప్రతి వీధిలో ప్రతి రోజు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పంచాయితీ రోడ్ల పై నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.కచ్చా డ్రైనేజిలను పారిశుద్ధ్యం చేయించాలని రోడ్డు పక్క చెత్తా చెదా రాలను తొలగించి బ్లీచింగ్ చల్లాలని గ్రీన్ అంబాజడర్లకు సూచించారు.అనంతరం ప్రతి షాపు వద్దకు వెళ్లి డస్టుబిన్లను ఉపయోగించాలని చెత్తను రోడ్లపైన వేయకూడదని తెలిపారు.



## వైఎస్సార్‌సీపీ బలోపేతంకు కృషి

**వింజమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం వింజమూరులో విలేకర్లతో మాటా ్లడుతూ ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే ప్రజల్లో అధికార పార్టీ పట్ల పెట్టుకున్న ఆశలు నెరవేరక అసంతృప్తితో ఉన్నారు. వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ జెండాను ఎగురవేసేందుకు అందరం కలిసి సమిష్టిగా పని చేయాలని సూచించారు. తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కీలక సూచనలు చేశారని, వాటిని క్షేత్ర స్థాయిలో అమలు చేసి పార్టీని మరలా అధికారంలోకి తీసుకొచ్చేందుకు పని చేస్తామని తెలిపారు.



## జిల్లాలో కొనసాగుతున్న నాకా బందీ

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాల తనిఖీని తీవ్రతరం చేసి, గంజా సేవించడం, నిల్వ, అమ్మకాలు, రౌడీయిజం, దౌర్జన్యాలు, దోపిడీ, దొంగతనాలు తదితర అసాంఘీక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసే చర్యల్లో భాగంగా జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోలీసు అధికారులు పలు ప్రాంతాల్లో నాకా బందీ చేపట్టారు. శుక్రవారం రాత్రి హైవే పాయింట్స్, టోల్ ప్లాజాలు, కూడళ్ళలో నాకా బంది నిర్వహించి, విస్తృతంగా తనిఖీ చేపట్టారు. వాహనాలు తనిఖీ చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ 14 కేసులు, ఓవర్ స్పీడ్/రాష్ డ్రైవింగ్ 15 కేసులు, 75 ఎంవి యాక్ట్ కేసులు నమోదు చేసి రూ.83,985 ఫైన్ విధించారు. అదే విధంగా అర్ధరాత్రి వరకు నెల్లూరు టౌన్, రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మద్యం సేవించి, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులపై కఠినంగా కౌన్సిలింగ్ లు నిర్వహించాలని, అలాంటి ప్రదేశాలలో నిఘా తీవ్రతరం చేయాలని, అర్ధరాత్రి వేళలో ప్రత్యేకంగా టౌన్ పరిధిలో రౌడీయిజం, దౌర్జన్యాలను నిర్మూలనకు వాహనాల తనిఖీ చేపట్టి సమగ్ర చర్యలు తీసుకునేలా ఎస్పీ ఆదేశించారు. జిల్లా ప్రజలకు భద్రత, భరోసా పెంపొందించడం, రాత్రి సమయాల్లో రోడ్లపై శాంతిభద్రతలు నెలకొల్పడం లక్ష్యంగా జిల్లా పోలీసులు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. క్రైమ్ ప్రోన్ ఏరియాలపై డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓపెన్ డ్రింకింగ్, పేకాట, గంజాయి అక్రమ నిల్వ, అమ్మకంలను అరికట్టుట, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు జరగకుండా తగిన చర్యలు చేపట్టడం జరిగిందని అధికారులు తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గురించి గానీ, రౌడీయిజం గురించి గానీ సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112కు కానీ తెలియచేయాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతో మాత్రమే పూర్తి స్థాయి నేర నియంత్రణ సాధ్యమవుతుందన్నారు.



## కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమం

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి ఆదేశాల మేరకు, స్థానిక నేత వేళ్లపాలెం శ్రీనివాసులు రెడ్డి, తోటపల్లి గూడూరు బీజేపీ మండల అధ్యక్షులు పర్వత అనీల్ కుమార్, ఇతర బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. మెడికల్ ఆఫీసర్ హేన అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నాయకత్వంలో అమలవుతున్న స్వచ్ఛ భారత్ కార్యక్రమం ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. మెడికల్ ఆఫీసర్ హేన మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సూచనల మేరకు, స్థానిక బీజేపీ నేత వేళ్లపాలెం శ్రీనివాసులు రెడ్డి సహకారంతో బీజేపీ నాయకులు వైద్యశాల ఆవరణను శుభ్రం చేశారని తెలిపారు. అనంతరం వైద్యశాలలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ చిత్రపటాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోడూరు బీజేపీ నేత వేళ్లపాలెం శ్రీనివాసులు రెడ్డిని మెడికల్ ఆఫీసర్‌తో పాటు వైద్య బృందం ఘనంగా సన్మానించింది. తదుపరి కోడూరు గ్రామ సచివాలయంలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటాన్ని బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి పెంచలయ్య, పొట్లపూడి నేత డాక్టర్ విజయ్ కుమార్, సీనియర్ నేత మొద్దు శ్రీనివాసులు, తుళ్లూరు జనార్ధన్, కె. వెంకురెడ్డి, మోషే, ఈ. నాగేశ్వరరావు, వి. అంజయ్య, సిహెచ్ వెంకటరమణయ్య, డి. హేమంత్ కుమార్, పి. శ్రీనివాసులు, సిహెచ్ రవి, గోపాల్, సుబ్బయ్య, సాదేపల్లి వేణు తదితరులు పాల్గొన్నారు.



## సోమిరెడ్డి విజయానికి శబరిమల శబరి యాత్ర - నిమ్మల

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని పేడూరు బీసీ సంక్షేమ సంఘం సర్వేపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు నిమ్మల రమేష్ గౌడ్ 2019 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది సోమిరెడ్డి గెలుపు కోసం తన మిత్రబృందంతో కలిసి శబరిమల శబరి యాత్ర చేపడుతూ వస్తున్నారు. సోమిరెడ్డి విజయం అనంతరం రెండోసారి శబరి యాత్ర నిర్వహించి, సోమిరెడ్డి పోస్టర్లతో శబరిమల కొండను ఎక్కినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రాజు గోపాల్ రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సోమిరెడ్డి రేవంత్ రెడ్డి సహా సోమిరెడ్డి కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండి ప్రజాపాలనను విజయవంతంగా కొనసాగించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తూ ఈ యాత్రను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిమ్మల రమేష్ గౌడ్ మాట్లాడుతూ తాను గత 15 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీతో అనుబంధం కొనసాగిస్తూ పార్టీ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే 2024 ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గంలోని అనేక మంది బీసీలను పార్టీకి చేర్చి, సోమిరెడ్డి విజయం కోసం తనవంతు కృషి చేసినట్లు పేర్కొన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సర్వేపల్లి నియోజకవర్గం మొత్తం తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం అన్నారు.



## విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు అవగాహన

**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం :** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఇంధన పొదుపు అంశంపై అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషాద్రి బాలచంద్ర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ గోపాలకృష్ణ, పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ దేశ అభివృద్ధికి విద్యుత్ కీలక పాత్ర పోషిస్తుందని, అదే సమయంలో విద్యు త్‌ను వృధా చేయకుండా మితంగా వినియోగించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పేర్కొన్నారు. అవ సరం లేని సమయంలో ఇళ్లలో లైట్లు, ఫ్యాన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు ఆఫ్ చేయాలని, కార్యాలయాల్లో కూడా విద్యుత్ పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్య ంలో బొగ్గు, నీరు, వంటి సహజ వనరులు తగ్గుతున్నాయని, అందువల్ల సోలార్, విండ్ వంటి పునరు త్పాదక ఇంధన వనరుల వినియోగంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు ఇంధన పొదుపు విషయంలో కుటుంబ సభ్యులకు, సమాజానికి అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## బీసీ రిజర్వేషన్ సమీకరణాలు.. సర్పంచ్ బరిలో సుధీర్?

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు మేజర్ పంచాయితీకి బీసీ రిజర్వేషన్ అమల్లోకి వస్తే రాబోయే పంచాయితీ ఎన్నికల్లో వీరబోయిన గంగాధర్ తమ్ముడు వీరబోయిన సుధీర్‌ను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయని గ్రామ రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కు సన్నిహితంగా ఉండటం, అలాగే స్థానికంగా తెలుగుదేశం పార్టీలో వీరబోయిన గంగాధర్ కు ఉన్న మంచి పేరు సుధీర్‌కు ప్రధాన బలంగా మారుతున్నాయని అంటున్నారు.గంగాధర్ సోదరుడిగా సుధీర్ పై గ్రామంలో ఇప్పటికే సానుకూల అభిప్రాయం ఉండడం ఎన్నికల్లో ప్రభావం చూపుతుందని ప్రజల మాట. గ్రామంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల జనాభా మెజారిటీగా ఉండటం కూడా సుధీర్ కు అనుకూల అంశంగా భావిస్తున్నారు. ముఖ్యంగా మత్స్యకార వర్గాల్లో సుధీర్‌కు ఉన్న మంచి పరిచయాలు, విశ్వాసం రాజకీయంగా కలిసివచ్చే అంశమని గ్రామస్థులు చెబుతున్నారు. వీరబోయిన కుటుంబం మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీని నమ్ముకుని పనిచేస్తూ రావడం, ప్రస్తుతం పార్టీ అధికారంలో ఉండటం కూడా కీలకంగా మారిందని విశ్లేషిస్తున్నారు.ఈ నేపథ్యంలో సుధీర్‌ను సర్పంచ్ అభ్యర్థిగా నిలబెట్టితే గెలుపు ఖాయమే అన్న సంకేతాలు వినిపిస్తున్నాయి. ఇంకొకవైపు, ప్రతిపక్ష నేతలతో సంప్రదింపులు జరిగితే సర్పంచ్ పదవిని తెలుగుదేశానికి ఏకగ్రీవంగా ఇవ్వడం, ఎంపీటీసీ ఎన్నికల సమయంలో వైకాపాకు అవకాశం కల్పించడం వంటి పరస్పర రాజీ కుదిరే అవకాశాలపై కూడా చర్చ జరుగుతోంది. అలా జరిగితే ఇరుపక్షాలకు మేలు జరుగుతుందని, ఎన్నికల ఖర్చు తగ్గడమే కాకుండా రాజకీయ రిస్కులు కూడా ఉండవని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి అన్ని వర్గాలను అనుకూలంగా మలుచుకుంటే వీరబోయిన సుధీర్ విజయం ఖాయమని గ్రామ ప్రజలు అంటుండగా, రాబోయే పంచాయితీ ఎన్నికలు గ్రామ రాజకీయాల్లో మరింత ఆసక్తికర మలుపులు తీసుకునే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.



## పేదల పథకం రద్దు దుర్మార్గం



**బుచ్చి డిసెంబర్ 19 ప్రభాతవార్త :** గ్రామీణ పేదలకోసం గతంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధీ హామి పథకాన్ని బిజెపి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గం అని సిపిఎం పార్టీ నాయకులు ఖండించారు. శుక్రవారం బుచ్చిరెడ్డిపాళెం గాంధీ విగ్రహం వద్ద సిపిఎం పార్టీ ఆద్వర్యంలో నిరసన నిర్వహించారు. ఉగాధి పథకం పేరు మార్చిడి ఉత్తర్వుల పత్రాలను దగ్గం చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతు గ్రామీణ పేదలకోసం ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధీ పథకాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పేరు మార్చి పథకాన్ని నీరు గార్చే విధంగా ప్రవర్తిస్తుందని అన్నారు. 2005లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన అప్పటికే ప్రభుత్వం ఈ పథకం కోసం రెండు లక్షల కోట్లను మంజూరు చేసిందన్నారు. ఇప్పటి వరకు దాన్ని పది సంవత్సరాల ముందు వరకు రెండు లక్షల ఇరవై వేల కోట్లకి పెంచిందన్నారు. కేంద్రంలో అధికారానికి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసేందుకు అనేక కుయుక్తులు పన్నుతుందన్నారు. ఈ పథకాన్ని 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వంతో నిర్వహించేందుకు కొత్త కొత్త పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం అమల్లోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో పేదలు జీవనోపాది కోల్పోతారు. ఇప్పటి వరకు ఈ పథకం 90 శాతం కేంద్ర ప్రభుత్వం 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో నడుస్తున్నాయి, ఈపథకం నిదులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వాలు నాన్న తంటాలు పడుతున్నాయి. 40 శాతం ఏవిధంగా ఇస్తాయని వారు ప్రశ్నించారు. అందు వల్ల కొత్త పథకాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ పేరు మీద ఉండే పథకాన్ని కొనసాగించాలని వాళ్ళు డిమాండ్ చేశారు. ఈపథకం తిరిగి ప్రవేశపెట్టే వరకు తమ ఆందోళన కొనసాగిస్తా మనిఅన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, సిఐటియు మండల కార్యదర్శి చల్ల కొలుసు మల్లికార్జున కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి విస్తా మునిస్వామి, జిల్లా నాయకులు గరికిపాటి సురేష్, పట్టణ కార్యదర్శి పోటంశెట్టి శ్రీనివాసులు, ఆవాజ్ నాయకులు షేక్ మునీర్ అహ్మద్, షేక్ జానీభాషా, సిపిఎం పార్టీనాయకులు షేక్ ఖాదర్‌బాషా, కందికట్టు వెంకటరమణయ్య, బిల్లా రఘురామయ్య, యువజన సంఘం నాయకులు కొమ్మి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడాకారుల మద్య ఎస్ఐ జమాల్ జన్మదిన వేడుకలు



**కావలి, డిసెంబర్ 19 ప్రభాతవార్త :** కావలి వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జమాల్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం జవహర్‌భారతి కళాశాలలోని డాకటర్ డిఆర్ క్రీడాప్రాంగణం నందు సీనియర్ వాలీబాల్ క్రీడా కారులు కేక్‌కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జవహర్‌భారతి కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెకటర్ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, పీజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ చేవూరు మణికంఠ, విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అమ్రాజ్ మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## వెంగళాపురంలో పశుఆరోగ్య శిబిరం

**– పశువులకు వైద్య పరీక్షలు చేయించుకోవాలి**



**లింగసముద్రం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వెంగళాపురం గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి ఆర్థిక సహకారంతో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పశు గణాభివృద్ధి ముఖ్య కార్యని ర్వాహణాధికారి డాక్టర్ మురళి కృష్ణ హాజరై మాట్లాడుతూ వారి సంస్థ ద్వారా ఉమ్మడి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఉచితంగా గర్భకోశ వ్యాధులు నివారణకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యాన్ని వాడటం వలన 90శాతం ఆడ దూడలు పుడతాయని ఒక ఇంజక్షన్ 150 రూపాయలు కావున పశుపోశకులు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వలేటివారిపాలెం సహాయ సంచాలకులు డాక్టర్ చెన్నకేశవులు మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధులు, వాటికి నివారణ చర్యలు గురించి తెలిపారు. లింగసముద్రం మండల పశువైద్యులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పోకూరు పశు వైద్యులు డాక్టర్ సుధాకర్ పశువులను పరీక్షించి ఖనిజ లవణాల మిశ్రమము, లివర్ టానిక్ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళాపురం పాడి రైతులు, సన్న జీవాల రైతులు, రైతు సేవా కేంద్రం పశు సంవర్ధకశాఖ సహాయకులు వినోద్ కుమార్, కిరణ్, రమేష్, చౌదయ్య, పాండు రంగారావు, తిరుణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులపై లాఠీచార్జీని ఖండిస్తూ నిరసన



**కావలి,డిసెంబర్ 19 ప్రభాతవార్త :** నెల్లూరు పట్టణంలోని మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న కార్మికులపై పోలీసులు లాఠీచార్జి జరిపి కార్మికులను భయాం దోళనకు గురిచేసి అక్రమ అరెస్టులను ఖండిస్తూ శుక్రవారం పట్టణంలో నాలుగోనెంబర్ కార్మికుల మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్బంగా సిఐటియు ఉపాధ్యక్షులు పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యలు 60సంవత్సరాల పేరుతో నిర్దాక్షిన్యంగా తొలగించిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని తెలిపారు. సమ్మెకాలంలో వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలిపారు. నెల్లూరు నగరంలో మున్సిపల్ కార్మికులు 45రోజులుగా శాంతియుతంగా ఆందోళన కొనసాగిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులను ప్రజాప్రతినిదులను కోరుతుంటే అమానుషంగా కార్మికులు, సిఐటియు నాయకులపై పోలీసులు లాఠీచార్జి జరిపి అక్రమంగా అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.క్రిష్ణయ్య, యూనియన్ నాయకులు జె.బాబు, వై.క్రాంతికుమార్, ఒంగోలు రమేష్, తురక సీనయ్య, ఎస్‌కె షానవాజ్, మహిళా నాయకులు చిన్నమ్మ, తిరుపతమ్మ తదితర కార్మికులు పాల్గొన్నారు.

## ఎస్‌సి ఎస్‌టి కాలనీల్లో మెరుగైన సౌకర్యాల కోసం చర్యలు తీసుకోండి

**బిట్రగుంట డిసెంబరు 19 ప్రభాతవార్త :** బోగోలు మండలంలోనిఎస్‌సి ఎస్‌టి కాలనీల్లో మెరుగైన సౌకర్యాల కోసం చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. ఎండిఓ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి ఎండిఓ సుబ్రమణ్యంకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి మాట్లాడుతూ ఎస్‌సి ఎస్‌టి కాలనీల్లో డ్రైనేజీ కాలువలు లేక, రోడ్లు లేక చెత్తా చెదారం వేసుకునేందుకు వసతులు లేక కొన్ని కాలనీలు డంప్ యార్డులు లాగా తయారయ్యాయని తెలిపారు. కొన్ని పాత రోడ్లు వలన కంకరలేచి వాహనదారులకు ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు చెత్తాచెదారం ఎస్‌సి, ఎస్‌టి కాలనీల పక్కన వేస్తున్నారని తెలిపారు. చెరువు పక్కన ఎస్‌సి ఎస్‌టి కాలనీలను పట్టించుకోవడం లేదన్నారు. సిసి రోడ్లు వేయలేదన్నారు. ఎస్‌సి ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు కోట్ల రూపాయిలు ఉన్నప్పటికి ఎస్‌సి ఎస్‌టి ప్రజాప్రతినిధులు నిధులు గురించి పట్టించుకోవడం లేదన్నారు. కోట్ల రూపాయిలు నిధులు ఉన్నప్పటికి రుణాలు ఇవ్వక పోగా వెలుగుకు సంబంధించిన బ్రోకర్లు ఎస్‌సి ఎస్‌టి నిధులు దుర్వినియోగం చేసి వారి అకౌంట్‌లలో వేసు కొన్నారని తెలిపారు. సబ్‌ప్లాన్ నిధులు 7కోట్ల రూపాయిలు దుర్వినియోగం చేసినట్లు కలెక్టర్‌తేల్చారని తెలిపారు.దొంగపేర్లు పెట్టుకొని నిధులు కాజేసిన విషయం తెలిసినప్పటికి ఏ పార్టీ గెలిస్తే ఆపార్టీ వెంట వుండటం వలన పట్టించుకోవడం లేదని తెలిపారు. చెరువు పక్కన ఉన్న రామస్వామిపాలెం ఎస్‌సి ఎస్‌టి కాలేనీల్లో రోడ్లు వేయకపోగా బురద రోడ్లుగా తయారు చేసారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు దుర్వినియోగం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకొని కాలనీల్లో రోడ్లు వేయాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సాదు ప్రసాద్, నూనె వెంకయ్య, బాబుసుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అశోక్‌నగర్‌లో ప్రత్యేక పారిశుద్య కార్యక్రమం



**వింజమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని అశోక్ నగర్‌లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని జరిపించారు. గ్రామంలోని పిచ్చి మొక్కల తొలగింపు డ్రైనేజీ కాలువలు పూడిక తీయు ట తదితర కార్యక్రమాలను చేపట్టారు. పారిశుధ్య పనులను ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి సర్పంచ్ సృజన పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అనారోగ్య పరిస్థితులు ఏర్పడకుండా దోమలు వృద్ది కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం కల్పించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు కృషి చేస్తున్నామన్నారు. వారితో పాటు ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## ఎంపీడీవోచే ఉన్నత పాఠశాల తనిఖీ



**బిట్రగుంట డిసెంబర్ 19 ప్రభాతవార్త :** బోగోలు మండలం పాతబిట్రగుంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను శుక్రవారం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాష్ట్రప్రభుత్వం పదవతరగతి విద్యార్థులకు సంబంధించి 100 రోజుల కార్యాచరణ పైన సమీక్షా నిర్వహించారు. ప్రభుత్వలక్షాన్ని ఉపాధ్యాయులు అందరు సమిష్టిగా పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు.

## నలిశెట్టి శీనయ్య కుటుంబ సభ్యులను పరామర్శించిన బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి



**ఆత్మకూరు,డిసెంబరు19,ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణంలోని 5వ వార్డులో టిడిపి నాయ కుడు నలిశెట్టి శీనయ్య (కూరగాయల శీనయ్య) గుండె పోటుతో గురువారం మృతిచె ందాడు. ఆయన కుటుంబ సభ్యులను శుక్రవారం బిఎస్ఆర్ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి పరా మర్శించారు. ఈసందర్భంగా ఆయన ఆకస్మిక మృతిపట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శీనయ్య సతీమణి, ఆయన ముగ్గురు కుమారులు, ఆయన అన్నదమ్ములతో,కుటుంబ సభ్యులతో జరిగిన ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో మనోధైర్యాన్ని కోల్పోకుండా ధైర్యంగా ఉండాలని తారక్‌నాథ్‌రెడ్డి వారికి ధైర్యం చెప్పారు.

## మిల్లెట్‌తో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలి



**కావలి,డిసెంబర్ 19 ప్రభాతవార్త :** మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మిల్లెట్‌తో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పిడి నాగరాజకుమారి తెలిపారు. పట్టణంలోని మహిలా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ఏపీఎం క్రిష్ణారావు అధ్యక్షతన కావలి మండల పొదుపు మహిళలకు మిల్లెట్ ఆహార తయారీపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పీడి నాగరాజకుమారి పాల్గొని మాట్లాడారు. మిల్లెట్‌తో తయారు చేసిన ఆహారాన్ని తీసుకుటే ఎంతో ప్రయోజనం అని దానివల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. ఎవరైనా మిల్లెట్‌ను తయారు చేసుకొని ఆర్థికంగా నిలబడాలని తెలిపారు. అనంతరం ఏపీఎం క్రిష్ణారావు ఎంపిడిఓ రహీంకు మొక్కను అందజేసి దుశ్యాలవాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం మదుసూదన్‌రావు, ఎంపిడిఓ రహీం, పొదుపు సమాఖ్య మహిళలు పాల్గొన్నారు.

## పోలియో నిర్మూళనపై అవగాహన ర్యాలీ



**కావలి,డిసెంబర్ 19 ప్రభాతవార్త :** కావలి రూరల్ మండలం, చలంచర్ల గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యసిబ్బంది ఆద్వర్యంలో శుక్రవారం పోలియో నిర్మూళనపై పాఠశాల విద్యార్థుల తోటి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్బంగా హెల్త్ ఆఫీసర్ భాను మహేష్ మాట్లాడుతూ డిసెంబర్ 21న ఆదివారం పోలియో దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోని ప్రజలకు అవగాన కల్పిస్తూ పోలియో నిర్మూళనపై ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. నిండు జీవితానికి రెండు చుక్కల పోలియో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కామేశ్వరి, ఆశావర్కర్లు కమల, కామేశ్వరి, సునిత, సంధ్య చలంచర్ల పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిజిటల్ పంటల సర్వేను ప్రారంభించండి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ప్రస్తుత రబీ సాగుకు సంబంధించి డిజిటల్ పంటల సర్వేను ప్రారంభించాలని జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి అధికారులను ఆదేశించారు. రబీ సీజన్‌లో అన్ని పంటలు భూకమతాలు తప్పనిసరిగా డిజిటల్ సర్వేలో నమోదు చేయాలని, గరిష్టంగా 20 మీటర్ల దూరం పరిమితిని పాటించాలని జిల్లాలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. డిజిటల్ పంటల సర్వేలో ఇప్పటి వరకు మండల వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రాలకు సంబంధించిన గ్రామాలకు, గ్రామ వ్యవసాయ సహాయకులను మ్యాప్ చేయడం, డీవైస్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కావున రైతులందరూ రైతు సేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. ప్రస్తుత డిజిటల్ పంట సర్వేలో పంట నమోదు వలన ధాన్యం కొనుగోలు, వడ్డీ లేని పంట రుణాలు, పంట భీమా, పంట నష్టం జరిగినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీ పొందేందుకు రైతులకు అవకాశం కలుగుతుందని వివరించారు.

## పొదుపు సంఘ సభ్యులు ఆర్థికంగా ఎదగాలి



**వింజమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** పొదుపు సంఘ సభ్యులు ఆర్థికంగా సామాజికంగా బలోపేతం కావాలని ఏపీఎం సుధాకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘాలకు, మండల సమాఖ్యకు మద్య కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పని చేయాలన్నారు. సమాఖ్యలు మహిళల ఆర్థిక అభివృద్ధి విజన్ ప్లాన్‌ను రూపొందిస్తూ పారదర్శకంగా అమలు చేయాలన్నారు. ప్రతి సభ్యురాలు స్త్రీ నిధి బ్యాంకు లింకేజ్ ఉన్నతి, రుణాలను అర్హులకు అందజేసి ఆర్థిక ఆదాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వారు తీసుకున్న రుణాలను సకాలంలో సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షురాలు పద్మ ఎల్సీసీ లక్ష్మీ నరసయ్య, సీసీలు సునీత, సుశీల, లక్ష్మీ కుమారి, విజయమ్మ, ఆదిలక్ష్మీ, అకౌంటెంట్ సువార్త పాల్గొన్నారు.

## రక్తదానం పట్ల అవగాహన అవసరం



**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, నెల్లూరు జిల్లా శాఖ మేనేజింగ్ కమిటీ సభ్యుడు మరియు రక్త నిధి కేంద్రం కోఆర్డినేటర్ అయిన బయ్యా ప్రసాద్ శుక్రవారం అత్యవసరమైన పేషెంట్ కు (నారాయణ హాస్పిటల్) సింగల్ బ్లడ్ డోనార్ ఆఫరెసిస్‌ను ఛైర్మన్ శ్రీ వాకాటి విజయ కుమార్ రెడ్డి, వైస్ ఛైర్మన్ శ్రీ చమర్తి జనార్ధన్ రాజు సమక్షంలో ప్లేట్లెట్స్‌నుదానం చేశారు.ఈ సంధర్భంగా బయ్యా ప్రసాద్ మాట్లాడుతూ , ప్రతి సంవత్సరం 16000 కు పైగా రక్త దాతలు స్వచ్ఛ ందంగా రక్తదానం చేస్తున్నారని,సహజంగా వాతావరణం మారినప్పుడల్లా ప్రజల ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపుతు ందని, వైరల్ ఫీవర్స్ వలన రక్తకొరత ఏర్పడుతుందన్నారు.ప్రతి ఒక్కరు తమ మిత్రులకు, బంధువులకు రక్తదానం మీద అవగాహన కలిగించి,వారిని రక్తదాతలుగా చేసి సమా జానికి మం చి జరిగే కార్య క్రమాలలో పాల్గొనేలా చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ కమిటీ సభ్యుడు శ్రీ దాసరి రాజేంద్ర ప్రసాద్,చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ యశోవర్ధన్, బ్లడ్ సెంటర్ మోటివేటర్స్ శ్రీ మధుసూదనరావు, శ్రీ భాస్కర్ రావు, శ్రీ సాయిరాం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ పై దృష్టి సారించండి ముఖ ఆధారిత హాజరు పై నిరక్ష్యం సహించను డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి . సుజాత



**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం** జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రములలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్(ఈ.హెచ్.ఆర్) నిర్వహించాల్సిన బాధ్యత ఆయా సీనియర్ అసిస్టెంట్ , జూనియర్ అసిస్టెంట్ , ఎల్.డి. కంప్యూటర్ లదేనని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డా॥ వి సుజాత శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు . రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ నిర్వహించటం పై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని, వీటి నిర్వహణలో నిరక్ష్యం వహిస్తే సంభందిత సీనియర్ అసిస్టెంట్ , జూనియర్ అసిస్టెంట్ , ఎల్.డి. కంప్యూటర్ ఆపరేటర్ల పై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో పని చేస్తున్న ప్రతి ఒక్క వైద్య ఆరోగ్య సిబ్బంది తమకు కేటాయించిన సమయం ప్రకారం ముఖ ఆధారిత హాజరు (ఎఫ్.ఆర్.ఎస్) వేయాలని, ఎఫ్.ఆర్.ఎస్ వేయ్యుట లో నిరక్ష్యం వహించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇక నుంచి పట్టణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి ఎటువంటి సమాచారం మరియు సమస్య అయిన ఈ ఆఫీసు ద్వారానే జిల్లా కార్యాలయానికి రావాలన్నారు. మెయిల్స్ ఉపయిగించరాదని, ఈ ఆఫీసు కు చేరిన సమాచారము మరియు సమస్యలను 24 గంటలలో పరిస్కరించాలన్నారు. ఫార్మాసి నందు వున్న మందుల యొక్క ఎక్స్పైరీ తేదీలను 4 నెలల ముందుగానే గుర్తించి, త్వరగా ఎక్స్పైరీ అయ్యే మందులను పంపిణీ చేసుకోవాలని తెలియచేసారు.స్క్రబ్ టైఫస్ గురుంచి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దీనికి సంపూర్ణ చికిత్స వుందని, అవసరమైన మందులు అన్నీ పట్టణ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వున్నాయని తెలియచేశారు. ముక్యంగా నివారణ చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని, శరీరం పూర్తిగా కప్పి వుంచే దుస్తులను ధరించుట, గుబురుగా వున్న పొదల్లోకి వెళ్లకుండా వుండుట, మట్టిలోకి వెళ్ళేటప్పుడు రబ్బరు బూట్లు ధరించుట, దోమ తెరలు వాడుట, శరీరం పై నల్లటి మచ్చ వుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించుట, జ్వరము, తల నొప్పి, వొళ్ళు నొప్పులు వంటి లక్షణాలు రెండు మూడు రోజులకి మించి వుంటే వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం నెల్లూరు జి.జి.హెచ్. లో సంప్రదించి చికిత్స పొందాలని తెలియచేశారు

## ఫల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయ వంతం చేదాం!



**కలిగిరి, డిసెంబర్19, ప్రభాతవార్త;** ప్రభుత్వం ప్రతిష్టాత్మకరంగా చేపట్టిన పల్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలిగిరి ప్రాథమిక వైద్యాదికారి బిజ్జం కుమారి తెలిపారు. శుక్రవారం కలిగిరి వైద్యశాలలో పల్స్ పోలియో పోష్టరును విడుదల చేశారు.ఈ సందర్బంగా వైద్యాదికారి మాట్లాడుతూ డిసెం బం 21న జరుగు పల్స్ పోలియో కార్యక్రమంలో 0నుండి 5సంవత్సరాల లోపల పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులతోపాటు యంఇఓసురేష్, అంగన్ వాడీసిబ్బంది,వైద్యశిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీవనోపాదులు మరింత పెంపుదల చేసుకోవాలి



**కోవూరు డిసెంబర్ 19 ప్రభాతవార్త :** పొదుపు గ్రూప్ మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకోవాలని పూర్తి స్థాయిలో సభ్యులను చేర్చుకొని తమ జీవోనోపాదులను మరింత పెంపుదల చేసుకోవాలని ఏపిజిబి మేనేజర్ విజయ్‌కుమార్ తెలిపారు . కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఏపిజిబి పరిధిలోని సంఘ బందాల అద్యక్షులు సిసిలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు బ్యాంకు లింకేజి రుణాల అవసరాన్ని గుర్తించి అటువంటి వారికి సకాలంలో రుణాలు అందించేలా తగు చొరవ తీసుకుంటామన్నారు. అదే విధంగా ఎన్‌పిసి ప్రకారం సభ్యులకు రుణాలు ఇవ్వడం జరుగుతు ఉదన్నారు. ఏపిఎం సుబ్బరాజు మాట్లాడుతు ప్రతి పొదుపు మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వం ఆశయం అన్నారు.ఈ దిశగా తమశాఖ ద్వారా అడుగులు వేస్తామన్నారు. రుణాలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవడమే కాకుండా క్రమం తప్పకుండా బ్యాంకులు చెల్లించి కోవూరు మండలాన్ని ఆదర్శంగా తీసుకోరావాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగు సిసి రాము తదిరులున్నారు.

## తాలూకా అధ్యక్షురాలిగా ఎన్నికైన ప్రత్యూషకు ఘన సన్మానం



**కలిగిరి, డిసెంబర్19, ప్రభాతవార్త;** నిన్నజరిగిన వింజమూరు తాలూకా యూనిట్‌కు సంభందించి ఆంధ్ర ప్రదేశ్‌ప్రభుత్వ ఉద్యోగుల సంఘంనూతన కమి టీ ఎన్నికల్లో వింజమూరుతాలూకా అధ్యక్షు రాలుగా ఏకగ్రీవంగా ఉన్నికైన కలిగిరి మండల యం పిడిఓ కె. ప్రత్యూ క్షను కలిగిరి యంపిడిఓ కార్యా లయంలో అధికారులు, శిబంది ఘనంగా సన్మానించారు. ఈసందర్బంగావారు నూతన అధ్యక్షురాలికి తమ శుబా కాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పనిచేసే అధికారిగా పేరున్న యంపిడిఓఅది . కారులు,తోటి సహచరుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారితరపున పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగాతమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంగానని నూతన అధ్యక్షురాలిగా ఎంపికైన ప్రత్యూక్ష తెలిపారు.

## బారతీయ స్టేట్‌బ్యాంకు పరంగా అన్నిపథకాలు అందజేస్తాం



**కలిగిరి, డిశెంబర్19, ప్రభాతవార్త;** రైతులకు, వర్తకులకు, వ్యాపారులకు, పొదుపుసంఘాలకు ఎవరికైనాసరే బారతీయ సేట్‌బ్యాంకు తరపు నఅన్ని పథకాలు అందజేయడం జరుగుతుందని బారతీయ స్టేట్‌బ్యాంకు రీజనల్ మేనేజర్ సత్యన్నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం కలిగిరి మండలంలోని క్రిష్ణారెడ్డిపాళెంలో సేట్‌బ్యాంకు ఆద్వర్యంలో యస్‌బిఐ అన్నదాత మహోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. కలిగిరి, వింజమూరు,దుత్తలూరు, ఉదయగిరి స్టేట్‌బ్యాంకుల పరిదిలో జరిగిన ఈ వేడుకలకు 4మండలాలనుండి రైతులు, వర్తకులు, పొదుపుసంఘాలు పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిదిగా డిజియం దినేష్ గులాఫీ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా అదికారులు రైతులకు కార్యక్రమాలు గావించారు. అనంతరం ఆర్‌యం మాట్లాడుతూ బారతీయ స్టేట్‌బ్యాంకు ప్రజలకు సేవచేయడానికి ముందుంటుందన్నారు. ఏసమస్య వచ్చినా తమనునేరుగా కలవ వచ్చు అన్నారు. వ్యవసాయానికి రుణాలు, పంటలకు డ్రోన్లుకు , పాడిపరిశ్రమ, కోళ్లపెంపకం, టాక్టర్లు కొనుగోలు, పొగాకు పంటలకు రుణాలు అందజేస్తామన్నారు. పొదుపుసంఘాలకు కూడా వివరిగా రుణాలు అందజేయడానికి ముం దుంటు ందన్నారు. స్వయంసంఘాలకు గ్రూపులకకే కాక వ్యక్తిగత లోన్లుకూడా ఇవ్వడం జరుగు తుందన్నారు. ఈ రుణాలను ప్రతిఒక్కరూ వినియోగించుకొని సకాలంలో చెలింపులు చెల్లించ వలసి ఉంటు ందన్నారు.కలిగిరి సంఘమిత్ర ఎపియం సుజాత మాట్లాడుతూ పొదుపుసంఘాలకు గతంలో తక్కువ మొత్తాలు ఇస్తునందువల్ల బాకీలు త్వరగా తీర్చేవారని ఇప్పుడుగ్రూపుకు 20లక్షలవరకు రుణాలు ఇస్తున్నందున కొంత ఆలస్య మౌతు ందన్నారు. బ్యాంకు అధికారులు పొదుపుసంఘాలురైతలకు సంభందించి రైతు ఉత్పత్తి దారులసంభందించి 105గ్రూపులు ఉన్నాయన్నారు. వాటికి సంభందించి కూడా లింకేజీ ఇవ్వాలన్నారు.రైతలకు సంభందించి లోన్లుకూడా ఇస్తే మరింత సంఘాలు బలోపేతమౌతాయన్నారు.ఈ కార్యక్రమంలో కలిగిరి యస్‌బిఐ మేనేజర్ నాగేంద్ర బాబు, వింజమూరు యస్‌బిఐ మేనేజర్ రామక్రిష్ణ, దుత్తలూరుయస్‌బిఐ మేనేజర్ నాగేశ్వరరావు, ఉదయగిరి యస్‌బిఐ మేనేజర్ బరత్ బ్యాంకు శిబ్బంది, రైతులు, పొదుపుసంఘాలు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో అవగాహన ర్యాలీ



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని పడుగుపాడు ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్ పోలియోకు సంబంధించి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు తప్పనిసరిగా ప్రత్యేక చొరవ తీసుకుని నూరుశాతం పల్స్ పోలియో చుక్కలు వేసేలా చొర తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామ పురవీధల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సురేష్, ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, ఏఎన్ఎం ఉమా, అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, సుభాషిణి, సుందరమ్మ, కామేశ్వరి, ఆశా, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** పదవ తరగతి అనేది విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమని ఈ దశలో ఒక ప్రణాళికబద్దంగా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిత అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం వంద రోజుల పబ్లిక్ పరీక్షల ప్రణాళికలో భాగంగా 170 మంది విద్యార్థులకు బలవర్థకమైన అల్పాహారం ఆమె సొంత నిధులతో అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ఈ పాఠశాలలోనే చదివి స్కూల్ టాపర్‌గా వచ్చానని, ప్రస్తుతం తాను ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ ఏఈగా పనిచేస్తున్నానన్నారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హరితను ఆదర్శంగా తీసుకుని మంచి మార్కులు సాధించాలని తెలిపారు. ఈ సందర్భంగా హరితకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగకరం



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** సైన్స్ మానవాళికి ఎంతో ఉపయోగకరమని ప్రాథమిక దశ నుంచి ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సైన్స్ సెంటర్ క్యురేటర్ ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. కోవూరులోని పీఆర్ఎన్ ఉన్నత పాఠశాల సమావేశ మందిరంలో శుక్రవారం కలామ్ సైన్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా సైన్స్ సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తే మంచి ఫలితాలు వస్తాయని ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు ప్రదర్శనలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## స్వమిత్రపై మరింత అవగాహన అవసరం



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కోవూరలుఒని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వమిత్ర కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ స్వమిత్రపై శనివారం మండలంలోని సచివాలయ ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి తప్పనిసరిగా వారుహాజరు కావాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జీఎస్‌డబ్ల్యూ సురేష్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటూ క్రీడల్లోనూ రాణించాలి

-జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు




**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార–విద్య** విద్యార్ధులు చిన్నతనం నుండే విద్యతోపాటూ క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొని రాణిం చాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నగరంలోని స్ధానిక నారాయణ మెడికల్ కళాశాల క్రీడామైదానంలో ప్రారంభించిన నారాయణ ప్రీమియర్‌లీగ్ పోటీల్లో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని , జ్యోతి ప్రజ్వల గావించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్దులకు అన్నీ రంగాల్లో ప్రావీణ్యత అవసరమన్నారు. తాను కూడా చిన్న తనంలో చదువుకునే సమయంలో క్రీడల్లో చురుగ్గా పాల్గొనటం జరిగిందని ఆయన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. క్రీడలతో మానశిక, శారీరక ఉల్లాసం, ఉత్సాహం లబిస్తాయన్నారు. అలాగే మంచిగా చదువుకున్ని అభివృద్ది చెందాలని కోరారు. మరో ముఖ్యఅతిధి జిల్లా క్రీడాధికారి కే.పాండురంగారావు మాట్లాడుతు విద్యార్దులకు ఇటువంటి క్రీడాపోటీల నిర్వహణ అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపోటములు సాధారణమని, ఓడిన వారు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి ప్రయత్నించాలన్నారు. అలేగే అందరూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల ఏజిఎం శ్రీధర్ మాట్లాడుతు తమ విద్యాసంస్ధల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ క్రీడా పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. తమ పాఠశాలల్లో విద్యార్దులకు చదువుతోపాటూ అన్నీ రంగాల్లో శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్దులకు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ కిషోర్స్‌రత్నం పాఠశాలల క్రీడోత్సవాలు



**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార–విద్య** డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్ధల క్రీడోత్సవాల్లో భాగంగా మూడవ రోజు శుక్రవారం నగరంలోని స్ధానిక ఏసీసుబ్బారెడ్డి క్రీడా ప్రాంగణంలో రోషిణి తర్నం జెఈఈ, కె.25 మెడికల్ ఓలింపియాడ్,ఎలైట్ ఒలింపియాడ్, రత్నం టెక్నోస్కూల్ విద్యార్దులు క్రీడా పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్ధల జిఎం రామూర్తి నాయుడు పాల్గొని క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ విద్యాసంస్ధల్లో విద్యార్దులకు చదువుతోపాటూ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మరక్షణ విద్యల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. తమ విద్యార్దులు అనేక పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమంగా నిలవడమే ఇందుకు ప్రత్యక్ష్య నిదర్శనమని తెలిపారు. విద్యార్దుల్లో దాగిఉన్న ప్రతిబను వెలికి తీసేందుకు ఇటువంటి క్రీడా పోటీల నిర్వహణ ఉపరసిస్తుందని పేర్కొన్నారు.క్రీడలతో విద్యార్దుల్లో దాగి ఉన్న ఒత్తిడి దూరమౌతుందని, అందుకే ప్రతిఏటా తాము ఈ పోటీలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నా మన్నా మన్నారు. తోలుత జాతీయ జెండాను ఆవిష్కరించారు.అ నంతరం విద్యార్దులు మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వ హించి ముఖ్యఅతిధులకు గౌరవ వందనంచేశారు. ఏఓలు తుహీన, సునీల్, వాణి, ఖాశీం, మేనేజర్లు రాజేష్, అజయ్‌సింగ్, అశోక్, ప్రిన్సిపాల్ మణిమాల, శివకుమార్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌ను అభినందించిన జనసేన నేత గునుకుల



**నెల్లూరు,డిసెంబరు19 ప్రభాతవార– విద్య** ఇటీవల నెల్లూరు మున్సిపల్ కార్పోరేషన్ ఇన్‌చార్జ్ మేయర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరిచిన రూప్‌కుమార్ యాదవ్‌ను జనసేపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా గునుకుల , రూప్ కుమార్ యాదవ్‌ను పు ష్పగుచ్ఛాలను అందించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ సందర్భంగా గునుకుల మాట్లాడుతు కార్పోరేషన్ పరిధిలో ఎవ్వరికి ఏ అసవరం వచ్చినా తక్షణం స్పందించి నాయకుల్లో రూప్‌కుమార్ ప్రధమ వరుసలో ఉంటారన్నారు. కార్యకర్తలకు అండగా ఉండటంలోనూ ఆయన అభినందనీయులని, జిల్లా రాజకీయల్లో కీలకంగా వ్యవహరిస్తున్న ఆయనకు ఇన్‌చార్జ్ మేయర్‌గా అవకాశం రావటం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో ఆయన మరిన్ని ఉన్నత స్ధానాలను అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, నాయకులుఎ హేమచంద్ర, నరహరి, కృష్ణమోహన్, అశోక్, శరవణ, మౌనేస్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజరాజేశ్వరి ఆలయంలో అన్నదానం కోసం

## రూ.1,00,116 విరాళం అందజేత



**నెల్లూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త–విద్య** నగరంలోని స్ధానిక దర్గామిట్టలో వెలసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆల యంలో భక్తుల అన్నప్రసాద వితరణ కోసం ఆలయ దేవస్థానం చైర్మన్ స్వర్గీయ రత్నం జయరామ్ సతీయణి కళ్యాణి రూ.1,00,116 నగదును అందజేశారు. ఈ నగదును దేవాదాయశాఖ సహాయకమిషనరు, ఆలయ ఈఓ కోవూరు జనార్ధన్‌రెడ్డికి అందించి రసీదును ఆమే స్వికరించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతు అన్నదాన కార్యక్రమాన్ని బయోమెట్రిక్ ద్వారా నిర్వహిస్తున్నామని, ఈ శుక్రవారం కూడా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి , అ న్నప్రసాదాన్ని స్వీకరించటం జరిగిందన్నారు. అలాగే ధనుర్మాసం సందర్భంగా తెల్లవారుజామున 5.45 గంటల నుండి అమ్మవారి దర్శనం చేసుకోవచ్చని, ప్రతిరోజు అమ్మవారికి కట్టు పొంగలి నివేదించటం జరు గుతుందన్నారు. సాయంత్రం 6 గంటల నుండి వేదపారాయణం, 8 గంటలకు పల్లకీ సేవ చేయటం జరుగు తుందని, భక్తులు అమ్మవారి సేవలో పాల్గొని తరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి




**నెల్లూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త–విద్య** శుక్రవారం నగరంలోని స్ధానిక కపాడిపాలెంలో 51వ డివిజన్ వైకాపా నాయకులు సందీప్‌రెడ్డి నాయకులు ఉమా, కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీ క్రిస్మస్ వేడుకల్లో తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటుచేసి మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని పేదలకు చీరలను అందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని పేదలకు చీరల పంపిణీ చేయటం సంతోషంగా ఉందన్నారు. క్రిస్మస్ పండుగ అంటేనే పేదలకు సేవ చేయటం అని ఈ ప్రాంతంలో క్రిస్మస్ వేడుకలను అట్టహాసంగా జరుపుకోవడం సంతోసంగా ఉందన్నారు. సేవగుణం కలిగిన క్రైస్తవులు వారు సం పాదిచిన దానిలో కొద్దిబాగం పేదలకు పంచటం మంచి ఆచారమన్నారు. 51,51 డివిజన్స్ వైకాపా కంచు కోటలని, రానున్న రోజుల్లో వైకాపా అధికారంలోని వస్తుందన్నారు.నాయకులు మహ మూబ్‌బాషా, మహేష్ యాదవ్, ధనుజారెడ్డి, బాల ప్రసాద్, కరుణ, అన్నమ్మ, సుజాత, రవి,హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డిఓ అనూష



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభా తవార్త** రాష్ట్ర హైకోర్టు జడ్జి కే.సురేష్ రెడ్డి నెల్లూరు పర్యటనలో భాగంగా జిల్లా ఆర్ అండ్‌బి వసతి గృహంలో నెల్లూరు ఆర్ డిఓ నాగసతోష్ అనూష మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలియ జేశారు

## కలెక్టరేట్లో కారుణ్య నియామకాలు



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** శుక్రవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల వివిధ శాఖలలో విధి నిర్వహణలో ఉంటూ మరణించినవారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియా మక పత్రాలువారి చాంబర్లో అందజేశారు. అందులో పశు సంవర్ధక శాఖలో అనిమల్ హస్బెండరి అసిస్టెంట్‌గా పని చేస్తూ మరణించిన జె.వెంకటరావు భార్యజి. భాగ్యమ్మకు ప్రభు త్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో కుక్‌గా కారుణ్య నియా మకం పత్రం అందజేశారు. అదేవిధంగా ఏపీఎస్ఆర్టీసీ లో డ్రైవర్‌గా పనిచేస్తూ మరణించిన టి .రాఘవయ్య కుమారుడు టి. పవన్‌కు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో ఆఫీస్ అబార్డినేట్‌గా నియమిస్తూ కారుణ్య నియామక పత్రాన్ని అందజేశారు.

## సిడిఎంఎతో కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్



**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 19 ప్ర భాతవార్త :** కమిషనర్ అండ్ డైరెకటర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్‌కుమార్ వివిధ అంశాలపై శుక్ర వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యా లయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభా గంలో కమీషనర్ వై.ఓ.నందన్ అధికా రులతో కలసి హాజరయ్యారు. సమా వేశంలో రెవెన్యూ వసూళ్ళు, ఆటోమ్యాటే షన్ యానిమల్ భర్త్ కంట్రోల్, అన్నా క్యాంటిన్ల నిర్వహణ, ట్రాఫిక్ సిగ్నల్స్, సిసి కెమరాల ఏర్పాట్లు, స్వచ్ఛసర్వేక్షణ, ప్రజాసమస్యల ఫిర్యాదుల పరిష్కారం చర్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వివిద అంశాల అమలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఆదేశాల జారీచేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కమీషనర్ కార్యాలయ వివిధ విభాగాల అధికారులతోసమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిడిఎంఏ నిర్దేశించిన అంశాలకు అత్యంత ప్రాధాన్యత కల్పించి వేగవంతంగా చర్యలు తీసు కోవాలని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి, టిపిఆర్ఓ వాసు బాబు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, ఇంజనీరింగ్ విభాగం ఈఈలు శేషగి రిరావు, అనీల్ కుమార్, రహంతుజానీ, డిఈఈ ముజాహిద్దీన్, రెవెన్యూ అధికారులు సమద్, శ్రీనివాసులు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే చొరవతో గంగవరం దళితవాడకు ప్రత్యేక రోడ్డు , కల్వర్టు



**కోవూరు, డిసెంబరు 19 ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చొరవతో కోవూరు మండలం గంగవరం గ్రామంలోని దళితవాడ వాసుల చిరకాల కోరిక ఎట్టకేలకు నెరవేరిం ది. గత ఎన్నికల స మ యంలోస్థానికులు తమసమస్యలను వివరిం చగా దానికి సానుకూలంగా స్పందించిన నేతలు ఆవా గ్దానాన్ని నెరవేర్చుకున్నారు.గత ఎన్నికల సందర్భం గా ఈ ప్రాంత వాసులు తమ ప్రాంతానికి ప్రత్యేక కల్వర్టు అవసరమని అప్పట్లో ఎన్నికల ప్రచారా నికి వచ్చిన ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో పల్లె పండుగ పథకం ద్వారా దానికి సంబం ధించిన పనులకు ఎమ్మెల్యే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని లక్ష్మీనరసారెడ్డి తెలిపారు. ఈ నూతన కల్వర్టు సీసీ రోడ్డుతో గంగవరం మెన్ రోడ్డు నుంచి నేరుగా దళిత వాడకు దారి ఏర్పడిందన్నారు. గతంలో ముంబయి రోడ్డుకు వెళ్లాలంటే ఊరంతా చుట్టుకుని వెళ్లాల్సి న పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఈ కల్వర్టు వలన ఈ ప్రాంత వాసులకు రవాణా సౌకర్యం ఉందన్నారు. ఈ విషయంలో చొరవ చూపిన లక్ష్మీనరసారెడ్డికి, కోవూరు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## " కలువాయమ్మ తల్లి మండలాన్ని కాపాడుతల్లి "

## కలువాయమ్మ సన్నిధిలో ప్రజలు అమావాస్య పూజలు



**కలువాయి డిసెంబర్ 19 ప్రభాతవార్త** " కలువాయమ్మ తల్లి మండలాన్ని కాపాడు తల్లి " అంటు మండలంలోని ప్రజలు పెద్దఎత్తున కలువాయమ్మ సన్నిధిలో అమావాస్య పూజలు నిర్వహించారు. కలువాయమ్మ సన్నిధిలో అమావాస్య పూజలు చేస్తే కోరినకోర్కెలు నెరవేరుతాయని ప్రజల అపార నమ్మకం.ప్రస్తుత కలువాయి ప్రజలందరు ఎంతో ఆందోళనకంగా ఉండడంతో అమ్మవారికి వద్ద అమావాస్య పూజలు చేసి వేడుకున్నారు. "సేవ్‌ది కలువాయంటు అమావాస్య " పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహాగణపతి,నవగ్రహ ,మృత్యుంజయ,గ్రామ దేవత మూల మంత్ర హోమాలతోపాటు ప్రత్యేకంగా శ్రీలక్ష్మీ మహా విష్ణు మూల మంత్ర హోమాలను నిర్వహించారు. పూర్ణాహుతిని యగ్నేశ్వరునికి సమర్పించిన భక్తులు దర్శించుకొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి కొలపర్తి సురేష్,రజిని దంపతులు వారి కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహారించగా టిడిపి మండల అధ్యక్షులు చల్లా రఘరామిరెడ్డితోపాటు గ్రామస్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## నెల్లూరు విద్యార్థిని ఆత్మహత్యకు

## పాఠశాల యాజమాన్యమే బాధ్యత

- తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డిమాండ్



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త** నెల్లూరు నగరంలోని ప్రియాంక ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకర మని, ఈ ఘటనకు పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ది పేరెంట్స్ అసోసియే షన్‌ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు అసోసి యే షన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు.

**ఫిర్యాదు చేసినా స్పందించని యాజమాన్యం:** తోటి విద్యార్థి వేధింపుల గురించి బాధితురాలి తల్లిదండ్రులు ముందే పాఠశాల యాజమాన్యానికి ఫిర్యాదు చేసినప్పటికీ, వారు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లే విద్యార్థిని మనస్తాపంతో బలవన్మరణానికి పాల్పడిందని అసోసియేషన్ ఆరోపించింది.

**– అధికారుల ఉదాసీనత:** ఇంత పెద్ద ఘటన జరిగినా జిల్లా విద్యాశాఖ అధికారులు కనీసం పాఠశాలను సందర్శించకపోవడం, బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం వారి విధి నిర్వహణ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.

**జిల్లా కలెక్టర్ ముందు ఉంచిన డిమాండ్లు: క్రిమినల్ కేసులు:** బాధ్యులైన పాఠశాల యాజమాన్యంపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

**గుర్తింపు రద్దు:** విద్యార్థుల భద్రతను విస్మరించిన సదరు పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి.

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలు:** 2025 జులైలో వెలువడిన సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో ఖచ్చితంగా అమలు చేయాలి.

**కౌన్సెలింగ్ కేంద్రాలు:** ప్రతి పాఠశాల మరియు కళాశాలలో విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రొఫెషనల్ కౌన్సెలర్లను నియమించి, అవగాహన సదస్సులు నిర్వహించాలి.

**భద్రతా చర్యలు:** అన్ని విద్యాసంస్థల్లో 24/7 హెల్ప్‌లైన్ నంబర్లు మరియు CCTV కెమెరాలు ఏర్పాటు చేయాలి.

**విచారణ:** విధుల్లో నిర్లక్ష్యం వహించిన విద్యాశాఖ అధికారులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. జిల్లా యంత్రాంగం ఈ విషయంలో తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పిఏపి విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు శిఖరం నరహరి, జిల్లా కార్యదర్శి ఉడుత రాజశేఖర్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు రావూరు రమేష్ బాబు, పి లీలామెహన్, సమైక్యాంధ్ర జేఏసీ నాయకులు ఆదిత్య సాయి పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం** ఈనెల 20న 33/11కేవీ తెలుగు గంగ సబ్ స్టేషన్ నందు మరమ్మత్తుల కారణంగా శివాజీ నగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎన్‌బీటీ కాలనీ, డైకస్ రోడ్డు, జేకే కాలనీ, చాణక్యపురి, వీఎంఆర్ నగర్, ఏవీకే ఎస్టేట్, గాంధీ నగర్, సంజయ్, గాంధీ నగర్, ఆర్‌సీఆర్ నగర్, వివర్స్ కాలనీ, శాంతి నగర్, వెంగలరావు నగర్, తెలుగు గంగ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడును. వినియోగదారులు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## శాంతి మార్గం- ప్రేమతత్వమే క్రీస్తు సందేశం

- మంత్రి నారాయణ సతీమణి రమాదేవి






**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం** క్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ ప్రేమ నిండిన మనసుతో జీవించాలని మంత్రి పొంగూరు నారాయణ సతీమణి రమాదేవి పిలుపునిచ్చారు. గోమతీనగర్‌లోని మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ సంబరాలను మంత్రి సతీమణి రమాదేవి అంగరంగవైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పొదలకూరు చర్చి సిబ్బంది చేసిన పరివర్తన నాటక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆసక్తిభరి తంగా సాగాయి. శాంతా క్లాక్ తాత వేషధారణ చిన్నారులను ఆకట్టుకుంది. అద్భుతమైన ప్రదర్శన చేసి అందరినీ అబ్బురపరిచిన చిన్నారులను పొంగూరు రమాదేవి అభినందించారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాండిల్స్ వెలుగులో కేక్ కట్ చేసిన రమాదేవి అందరికి క్రిస్మస్ శుభాకాం క్షలు తెలిపారు. 2026 క్రిస్టియన్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుకలు అందజేశారు. అనంతరం రమాదేవి ప్రసంగిస్తూ క్రిస్మస్ అంటే మానవాళికి శాంతి, కరుణ పంచే దేవుడు భూమి మీదకు వచ్చిన రోజు అని తెలిపారు. నీతో పాటు నీ పొరుగు వారిని ప్రేమించమనేది క్రీస్తు బోధనగా ఆమె పేర్కొన్నారు. తన అత్తయ్య కూడా ఇరుగు చల్లన, పొరుగు చల్లన అని పూజలు చేసేవారని, తనకు అలాగే అలవాటు చేశారని గుర్తు చేశారు. క్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రేమతత్వంతో పయనిద్దామని పిలుపునిచ్చారు. ఈ క్రిస్మస్ అందరి జీవితాల్లో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు నింపాలని ప్రార్థిస్తున్నానన్నారు. ఈ ప్రి క్రిస్మస్ వేడుకల్లో డాక్టర్ మల్లి దొరసాని, ఐఆర్ఎస్ అధికారి ఉషా కిరణ్, క్రిస్టియన్ మత పెద్ద డేవిడ్ దయాసాగర్‌లు తమ సందేశాన్ని ఇచ్చారు.

## ఎస్ఈఐఎల్ ఎనర్జీకి విశిష్ట గుర్తింపు

- వరుసగా రెండోసారి గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ సాధించిన కంపెనీ



**ముత్తుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:** భారతదేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారులలో ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ విశిష్ట గుర్తింపు సాధించింది. 2025 – 26 సంవత్సరానికి కూడా ప్రతిష్టాత్మక గ్రేట్ ప్లేస్ టు వర్క్ సర్టిఫికేషన్ పొందడం పట్ల గర్వంగా ఉందని ప్రకటించింది. కంపెనీలో పనిచేసే ఉద్యోగులు కంపెనీ గురించి సర్వేలో వ్యక్తపరిచే అభిప్రాయం ఆధారంగా ఈ ప్రతిష్టాత్మక సర్టిఫికేషన్ లభిస్తుంది. ఈ సంవత్సరం 86 మంది ఉద్యోగులు ఎస్ఈఐఎల్ ఎనర్జీ పని చేయడానికి గొప్ప ప్రదేశం అని అన్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ అనేది ప్రపంచ ప్రసిద్ధి గాంచిన సంస్థ. ఈ సంస్థ కార్యాలయ సంస్కృతి, ఉద్యోగి అనుభవం, ఆదాయాన్ని పెంచే నాయకత్వం, ఉద్యోగి నిలుపుదల, ఆవిష్కరణల వృద్ధి, తదితర అంశాలపై పనిచేస్తుంది. ఈ సందర్భంగా ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈఓ జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ"ఎస్ఈఐఎల్, ఎనర్జీలో, మా ఉద్యోగులు మా గొప్ప ఆస్తి అని విశ్వసిస్తున్నాము. వరుసగా రెండవ సంవత్సరం గ్రేట్ ప్లేస్ టు వర్క్‌సర్టిఫైడ్ సంస్థగా గుర్తింపు పొందడం పట్ల మేము సంతోషిస్తున్నాము. ఇది పనిజీవిత సమతుల్యత, వృద్ధి, అవకాశాలు, ఉద్యోగుల శ్రేయస్సుకు ప్రాధాన్యతనిచ్చే సంస్కృతిని పెంపొందించడానికి మా నిబద్ధతకు నిదర్శనం. మా బృంద సభ్యులు వ్యక్తిగతంగా, అలాగే వృత్తిపరంగా అభివృద్ధి చెందడానికి, ఆవిష్కరణలు చేయడానికి, అభివృద్ధి చెందడానికి వీలుగా వాతావరణాన్ని అందించడానికి మేము కృషి చేస్తామని పేర్కొన్నారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ పరిశోధన ప్రకారం ఉద్యోగార్థులు సర్టిఫైడ్ కార్యాలయంలో గొప్ప బాస్‌ను పొందే అవకాశం 4.5 రెట్లు ఎక్కువ సర్టిఫైడ్ కార్యాలయాల్లో చేరేందుకు 93 ఎక్కువ మంది ఉద్యోగులు ఇష్టపడతారు. న్యాయంగా జీతం పొందే అవకాశం, కంపెనీ లాభాలలో న్యాయమైన వాటాను సంపాదించే అవకాశం, పదోన్నతిలో న్యాయమైన అవకాశం ఉంటుంది.

## కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు

- యువతకు పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే



**ముత్తుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు కల్పిస్తున్నామని, దీంతో యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతుందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ముత్తుకూరు మండలంలోని మత్స్య కళాశాలలో ఏపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సోమిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్వేపల్లిలో మూడో జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు. మొదట విక్రమ సింహపురి యూనివర్సిటీలో రెండోది పొదలకూరులో నిర్వహించామన్నారు. ప్రముఖ కంపెనీలు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చాయన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మినిస్టర్ నారా లోకేష్ బాబు సారథ్యంలో రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు రాష్ట్రం నుంచి పారిపోయిన పరిస్థితి ఇప్పుడు ఇంటర్నేషనల్ కంపెనీలు కూడా ఏపీ వైపు చూస్తున్నాయని తెలిపారు. ముత్తుకూరుకు సమీపంలో క్రిస్ సిటీ రాబోతోందన్నారు. పరిశ్రమలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నారు. దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన కింద యువతకు ఉపాధి శిక్షణ చేపడుతోందన్నారు. పదో తరగతి పైన విద్యార్హత కలిగిన వారు ఉపాధి శిక్షణ పొందవచ్చు అన్నారు. 2014 – 19 మధ్య ఎంతో విజయవంతంగా నిర్వహించబడిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లపై వైసీపీ ప్రభుత్వం కక్షకట్టిందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను మూసివేయడంతో పాటు చంద్రబాబు నాయుడిని జైలుకు పంపడం వంటి దుర్మార్గాలకు పాల్పడిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఏపీలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, విజనరీ లీడర్‌గా పేరుగాంచిన చంద్రబాబు నాయుడు పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే ముందున్నారు. చంద్రబాబు నాయుడు పనితనాన్ని గుర్తించి ది ఎకనమిక్ టైమ్స్ మీడియా సంస్థ బిజినెస్ రీఫార్మర్ ఆఫ్ ద ఇయర్‌గా ఆయనను గౌరవించిందని కొనియాడారు. ఇప్పటి వరకు చాలా కొద్ది మంది ప్రముఖ వ్యక్తులకు మాత్రమే ఈ అవార్డు లభించిందన్నారు. చంద్రబాబు నాయుడికి ఈ అవార్డు దక్కడంపై తెలుగు ప్రజలందరం గర్వపడుతున్నామన్నారు. ఈ ఘనతను జగన్మోహన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పరిశ్రమలను కుప్పకూల్చేసిన వ్యక్తి ఆయన అమర్ రాజా కంపెనీని తెలంగాణకు, కియా అనుబంధ పరిశ్రమలను కర్ణాటకకు తరిమేశారు. రాష్ట్రానికి రావాల్సిన లక్షల కోట్ల పెట్టుబడులు జగన్మోహన్ రెడ్డిని చూసి వెనక్కివెళ్లిపోయిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడి కష్టపడే తత్తం, విజనరీతో రాష్ట్రం పూర్వవైభవం దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీల మల్లికార్జున యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, కృష్ణపట్నం దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు, మండల తెలుగు యువత అధ్యక్షులు రాగల శివకృష్ణ, టిడిపి సీనియర్ నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, కృష్ణపట్నం సొసైటీ అధ్యక్షులు పల్లం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్వేపల్లి ఐటి ఐ విభాగ నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు, దండు శ్రీనివాసులు, ఆలిముత్తు, ముత్తుకూరు పట్టణ అధ్యక్షులు బులిగర్ల శ్రీనివాసులు, బిజెపి నాయకులు కాకుటూరు రవీందర్ రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులతో భేటీ



**నెల్లూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త –వైద్యం** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్దిలో భాగంగా శుక్రవారం పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అవ్వనున్న నేపథ్యంలో పార్ల మెంట్ భవనం ముందు ఎంపీలతో ఆయన ఫొటో దిగగా ఎంపీ వేమిఏడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కేంద్ర మంత్రులతో భేటీ అవ్వనున్నారు.